## ఓటీఎస్ ఆఫర్.. 31 వరకే..

- బకాయి నీటి బిల్లు చెల్లిస్తే.. వడ్డీ, ఆలస్య రుసుంపై ప్రత్యేక రాయితీ
- కూకట్‌పల్లి డివిజన్‌లో రూ.18.36 కోట్ల రాయితీ
- సద్వినియోగం చేసుకోవాలని వినియోగదారులకు సూచన

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 23: బకాయి నీటి బిల్లులు చెల్లిస్తే.. నీటి బిల్లులపై ఆలస్య రుసుముతోపాటు వడ్డీ పై రాయితీ లభిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జలమండలి అధికారులు కోరుతున్నారు. నగరంలో జలమండలికి రావాల్సిన నీటి బిల్లులు పేరుకుపోవడంతో బకాయి బిల్లులతోపాటు ఆలస్య రుసుము, వడ్డీ భారం భారీగా పేరుకుపోయాయి. బకాయి నీటి బిల్లులను చెల్లించేందుకు వినియోగదారులు వెనుకంజవేస్తున్నారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని జలమండలి ఉన్నతాధికారులు వన్ టైం సెటిల్మెంట్ పథకం(ఓటీఎస్ ఆఫర్)ను తీసుకొచ్చారు. ఈ స్పెషల్ స్కీమ్‌లో బకాయి నీటి బిల్లులను చెల్లిస్తే ఆ బిల్లుపై ఉన్న ఆలస్య రుసుముతో వడ్డీపై రాయితీని ప్రకటించారు. ఈనెల 31వ తేదీ వరకు ఈ పథకం అమలులో ఉంటుందని, ఈ అవకాశాన్ని జలమండలి వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

**కూకట్‌పల్లి డివిజన్‌లో రూ.18.12 కోట్ల రాయితీ**

కూకట్‌పల్లి జలమండలి 9వ డివిజన్‌లో


కూకట్‌పల్లి జలమండలి కార్యాలయం

ఓటీఎస్ ఆఫర్‌లో 33,417 మంది వినియోగదారులు అర్హత సాధించారు. వీరికి సంబంధించి రూ.50.05కోట్ల నీటి బిల్లుల బకాయిలు ఉన్నాయి. ఓటీఎస్ ఆఫర్‌లో రూ.18.12 కోట్ల ఆలస్య రుసుము, వడ్డీపై రాయితీ లభించగా, మిగిలిన రూ.31.93 కోట్ల బకాయి నీటి బిల్లులను వసూలు చేయాల్సి ఉన్నది. ఈ వారం రోజుల స్పెషల్ డ్రైవ్‌లో 3,900 వినియోగదారులకు చెందిన రూ.7.50 కోట్ల నీటి బకాయిలను వసూలు చేయాల్సి ఉండగా, వీరికి రూ.2.50కోట్ల రాయితీ లభించింది. బకాయి నీటి బిల్లులను వసూలు చేసేందుకు రోజువారీ కార్యాచరణను సిద్ధం చేశారు. ఓటీఎస్ ఆఫర్‌పై ప్రజలకు అవగాహన కల్పించి పెండింగ్ నీటి బిల్లులు పూర్తిగా వసూలు చేసేలా పని చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

### ఆన్‌లైన్‌లో చెల్లింపులకు అవకాశం..

జలమండలికి చెల్లించాల్సిన బకాయి నీటి బిల్లులను ఆన్‌లైన్‌లో కూడా చెల్లించవచ్చు. జలమండలి క్యాష్ కౌంటర్లు వద్ద నేరుగా చెల్లించవచ్చని ఆన్‌లైన్, గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం యాప్‌ల ద్వారా ఎన్‌ఈఎఫ్‌టీ, ఆర్‌టీజీస్, బీపీపీఎస్‌ల ద్వారా కూడా చెల్లించవచ్చు. జలమండలి అధికారిక వెబ్‌సైట్ లాగిన్‌తో, జలమండలి సిబ్బంది ఇంటి వద్దకు వచ్చినప్పుడు ఏపీవోఎస్ యంత్రం ద్వారా, మీసేవ, ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా చెల్లించవచ్చును. బకాయి నీటి బిల్లుల వడ్డీ రాయితీపై సందేహాలు ఉంటే 155313 ఫోన్ నంబర్‌కు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. సకాలంలో నీటి బిల్లులు చెల్లించి... మెరుగైన నీటి సరఫరా సేవలను పొందాలని కోరుతున్నాం.

*– అంబాటి ప్రభాకర్‌రావు, జీఎం, కూకట్‌పల్లి జలమండలి డివిజన్*

---

భవిష్యనిధి సమస్యల పరిష్కారానికి

### నిధీ ఆప్కే నిఖత్

బాలానగర్, అక్టోబర్ 23: భవిష్యనిధి సంస్థ సమస్యల పరిష్కారానికి 'నిధీ ఆప్కే నిఖత్ 2.0' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ కమిషనర్ డాక్టర్ హేమంత్ ఎం తిర్పూడే ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 28వ తేదీన ప్రశాంత్‌నగర్ ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం భవనం సముదాయంలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు 'నిధీ ఆప్కే నిఖత్ 2.0' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోర్టల్స్ ఉమాంగ్ ఆయాప్ ద్వారా అడ్వాన్స్‌లు ఎలా ఫైలు చేయాలి, అడ్వాన్స్‌లు దాఖలు చేయడానికి అవసరాలు,మినహాయించబడిన ఉద్యోగులు, స్వచ్ఛంద విరాళాలు, సభ్యుల సర్వీస్ డెలివరీ గ్రీవెన్స్ రీడ్రెసల్, ఈపీఎఫ్ అండ్ ఎంపీ చట్టం యజమానులు, ఉద్యోగులు విధులు అండ్ బాధ్యతలపై దృష్టి సారించి కొత్తగా కవర్ చేయబడిన సంస్థల కోసం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### అంతర్గత లింక్‌రోడ్డును పునరుద్ధరించాలి

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 23 : కుత్బుల్లాపూర్ చింతల్‌లో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని, అంతర్గతంగా ఉన్న లింక్ రోడ్డును పునరుద్ధరించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు కేఎం ప్రతాప్ కోరారు. బుధవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సంబంధిత డీసీ, ఇంజినీరింగ్ సెక్షన్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

### సీఐకి శుభాకాంక్షలు

బాలానగర్, అక్టోబర్ 23 : బాలానగర్ సీఐ నర్సింహరాజుకు బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం బాలానగర్ పీఎస్‌కు వెళ్లి సీఐ నర్సింహరాజును కలిసి ఆయనకు శాలువాకప్పి, పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. బాలానగర్, ఫతేనగర్ డివిజన్ల ప్రజలకు శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎండీ ఖాజా, మహ్మద్ బాబా, నర్రా దేవేందర్‌రెడ్డి, నాగేందర్‌గౌడ్, ఆర్ శ్రీనివాస్ ముదిరాజ్, ప్రేమ్‌కుమార్, వెంకటాచారీ, ఎం.సుధాకర్, నాగరాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


ఛటర్జీ (ఫైల్)

కొండాపూర్, అక్టోబర్ 23:అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నల్లగండ్లలోని అపర్ణ సరోవర్ జెనిత్‌లో నివాసం ఉండే ప్రాంతిక్ ఛటర్జీ(32), ప్రైవేట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా, ఛటర్జీ గ్యాస్ట్రిక్ సమస్యతో బాధపడుతూ, ప్రతిరోజు ఉదయం పాన్ డీ మాత్రలు తీసుకుంటున్నాడు. వైద్యులను సంప్రదించినప్పటికీ ఎలాంటి సమస్యలు లేకపోగా, గ్యాస్ట్రిక్ సమస్య బాధపెడుతూనే ఉన్నది. రోజు మాదిరిగానే ఛటర్జీ బుధవారం ఉదయం పాన్ డీ మాత్ర తీసుకున్న కొద్ది సేపటికి ఇంట్లో కుప్పకూలిపోయాడు. దీంతో భార్య శ్వేత సుబ్రసేన్ సమీపంలోని దవాఖానకు తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య శ్వేత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### చికిత్స పొందుతూ యువకుడి మృతి


శ్రీనివాస్ (ఫైల్)

కొండాపూర్, అక్టోబర్ 23: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం... గుల్‌మోహర్‌పార్కు, నేతాజీనగర్ కాలనీలో నివాసం ఉండే బోయ వెంకటేశ్ కుమారుడు బోయ శ్రీనివాస్(20), ఈ నెల 16వ తేదీన తన స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలను పూర్తి చేసుకుని, రాత్రి 10 గంటల సమయంలో భోజనం చేసేందుకు అందరు స్నేహితులంతా కలిసి ఆటోలో వెళ్తున్నారు. ఈ క్రమంలో గుల్‌మోహర్‌పార్కు సిగ్నల్ వద్ద ఆగి ఉన్న డీసీఎంను తప్పించబోగా ఆటోలో ముందు కూర్చున్న శ్రీనివాస్‌కు డీసీఎం వెనక వైపు ఉన్న ఇనుప కడ్డీ కడుపు భాగంలో బలంగా తగిలింది. దీంతో అతన్ని సమీపంలో దవాఖానలో ఫస్ట్ ఎయిడ్ చేయించి, మరుసటి రోజు కొండాపూర్‌లోని జిల్లా దవాఖానలో చికిత్సనందించారు. కాగా, అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. శ్రీనివాస్ కడుపుకి ఇనుప కడ్డీ బలంగా తగలడంతో కిడ్నీలు పాడై, పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందిన వైద్యులు తెలిపారు. ఈ మేరకు వెంకటేశ్ ఫిర్యాదును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

---

## ఖాళీ స్థలాల్లోనే పటాకుల దుకాణాలు


పటాకుల విక్రేతలతో సమావేశం నిర్వహిస్తున్న డీసీ మోహన్‌రెడ్డి

మియాపూర్, అక్టోబర్ 23: దీపావళిని పురస్కరించుకుని పటాకుల విక్రయాలను ప్రభుత్వ నియమనిబంధనల మేరకే చేపట్టాలని చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రధానంగా ఖాళీ స్థలాల్లోనే దుకాణాలు ఏర్పాటు చేయాలన్నారు. పటాకుల విక్రేతలతో పోలీసు, హెల్త్, పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతో కలిసి డీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విక్రేతలు విధిగా అనుమతులు పొందిన మీదటే విక్రయాలను చేపట్టాలన్నారు. గంగారం బేబీ పాండ్ వద్ద ఈ సారి పటాకుల విక్రయ దుకాణాల ఏర్పాటుకు అనుమతి ఇస్తున్నట్లు ఆసక్తి కలవారు వినియోగించుకోవాలని డీసీ సూచించారు. సర్కిల్ కార్యాలయ ఆవరణలోని కల్యాణ మంటపంలో పటాకుల విక్రయ దుకాణాల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడం లేదని మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఫైర్, పోలీసు విభాగాల నుంచి ఎన్‌వోసీలు పొందిన దుకాణాలకు మాత్రమే అనుమతులను మంజూరు చేస్తామని, భిన్నంగా వ్యవహరించే దుకాణాలపై చర్యలు తీసుకుంటామన్నారు. ట్రేడ్ లైసెన్సు లేకుండా పటాకుల విక్రయిస్తే కఠిన చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు. సమావేశంలో ఏసీపీ నాగిరెడ్డి, వైద్యాధికారి డాక్టర్ రవి, విజయ్, ఆయా ఠాణాల ఎస్‌ఐలు, విక్రేతలు పాల్గొన్నారు.

## వరద బాధితుల పిల్లల కోసం 5వేల పుస్తకాలు

రెడ్ క్రాస్ సొసైటీకి ర్యాడిక్లిప్ హైస్కూల్ నోట్ పుస్తకాల అందజేత

బాలానగర్, అక్టోబర్ 23: వరద బాధితుల పిల్లల కోసం ర్యాడిక్లిప్ హైస్కూల్ యాజమాన్యం నోట్‌పుస్తకాలు అందజేయడం అభినందనీయమని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ అన్నారు. బుధవారం ఫతేనగర్ డివిజన్ పరిధి బాలానగర్ ప్రధాన రహదారిలో గల ర్యాడిక్లిప్ స్కూల్ యాజమాన్యం స్పందించి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ చైర్మన్ మామిడి భీమ్‌రెడ్డి సూచనల మేరకు యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ మణిదీప్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ చేతుల మీదుగా స్కూలు యాజమాన్యం పుస్తకాలు అందజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో తెలంగాణ జిల్లాలోని ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, ఏపీలోని విజయవాడలో సంభవించిన వరద ముంపునకు నష్టపోయిన వరద బాధితుల పిల్లల కోసం 5000 పుస్తకాలు, స్టేషనరీని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ శాఖకు అందజేయడం జరిగిందన్నారు. పాఠశాలలు, కళాశాలల నుంచి స్టేషనరీని రెడ్‌క్రాస్ సొసైటీ సేకరిస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి పుస్తకాలు అందజేసిన ర్యాడిక్లిప్ స్కూల్ యాజమాన్యానికి రెడ్‌క్రాస్ సొసైటీ కృతజ్ఞతలు తెలియజేసిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ మేనేజ్‌మెంట్ వరుణ్, హెడ్ మాస్టర్ మాధవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వరద బాధితుల కోసం రెడ్‌క్రాస్ సొసైటీకి కార్పొరేటర్ సతీశ్‌గౌడ్ చేతులమీదుగా నోట్ పుస్తకాలను అందజేస్తున్న ర్యాడిక్లిప్ స్కూల్ యాజమాన్యం

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం


ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

**ఎమ్మెల్యే కృష్ణారావు**

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 23: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 27 మంది లబ్ధిదారులకు రూ.9,68,500 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో వైద్యశాలలో చేరి కష్టాలలో ఉన్న పేదలకు అండగా ప్రభుత్వ ఉంటుందని.. ఈ అవకాశాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు... కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, స్థానిక నేతలు ఉన్నారు.


బాధిత కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, అక్టోబర్ 23: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలువురికి సీఎం సహాయ నిధి పథకం ద్వారా మంజూరైన రూ. 1.20 లక్షల ఆర్థిక సాయం చెక్కులను పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బుధవారం వివేకానందనగర్‌లోని తన నివాసంలో బాధిత కుటుంబాలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పథకం తన నిరంతర సేవల ద్వారా పేద ప్రజలను ఆదుకుంటున్నదన్నారు. ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం అందిస్తూ ఆర్థిక భరోసాను కల్పిస్తున్నదని గాంధీ పేర్కొన్నారు. ఈ పథకం అందించే ఆర్థిక సాయంతో నిరుపేద ప్రజలు కార్పొరేట్ దవాఖానలో ఉచితంగా వైద్య సాయం పొందుతూ తమ అనారోగ్యాలను దూరం చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో అశోక్ గౌడ్, చంద్రకాంత్‌రావు, శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్, రాజేందర్, ఇబ్రహీం, అనిల్, సాంబయ్య, శ్రీహరి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

**బల్దియా సీసీపీని కలిసిన గాంధీ**

బల్దియా ప్రధాన కార్యాలయంలో సీసీపీ శ్రీనివాస్‌ను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ బుధవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలపై సీసీపీతో చర్చించారు.

## ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు




మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవం బుధవారం మాదాపూర్‌లోని శిల్ప కళా వేదికలో ఘనంగా నిర్వహించారు. మెథరిక్ ఉత్సవ్ 2కే24 పేరిట నిర్వహించిన ఈ వేడుకలకు ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం ముఖ్యఅతిథిగా హాజరవ్వగా, ఎంఎల్‌సీ మహేశ్ గౌడ్, ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ, సినీ నటుడు నాగచైతన్యలతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మెరుగైన ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

*– కొండాపూర్, అక్టోబర్ 23*

## ఎంబీఏ జవాబు పత్రాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 23: ఓయూ పరిధిలోని ఎంబీఏ పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 4వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

**వివిధ కోర్సుల పరీక్ష ఫలితాల విడుదల**

ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ లాంగ్వేజెస్, మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ, మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్‌ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్‌ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్‌ఎల్‌బీ తదితర కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు చెప్పారు.

**వివిధ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు**

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్/సీనియర్ డిప్లొమా ఇన్ ఫ్రెంచ్/జర్మన్ పరీక్షలను వచ్చే నెల 5వ తేదీ నుంచి, బీఫార్మసీ (పీసీఐ) ఎనిమిదో సెమిస్టర్ మేకప్ పరీక్షలను 6వ తేదీ నుంచి, బీసీఏ ఆరో సెమిస్టర్ మేకప్ పరీక్షలను 8వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

**బీఏ రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం**

ఓయూ పరిధిలోని బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. మెమోలను మూడువారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి ఈనెల 28వ తేదీలోగా టీఏస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈనెల 30వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

జీడిమెట్ల/మాధాపూర్, అక్టోబర్ 23: విద్యుత్ మరమ్మతుల కారణంగా 33/11కేవీ జీడిమెట్ల ఎస్‌ఎస్‌ఐ ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 10 నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని జీడిమెట్ల ఎఈ పి.ప్రసూన బుధవారం తెలిపారు. 11 కేవీ ఎపీఐఐసీ ఫీడర్ పరిధిలో టీఎస్ఐఐసీ కాలనీ, 11 కేవీ గంపల బస్తీ ఫీడర్ 33/11 కేవీ జీడిమెట్ల ఎస్‌ఎస్ 4 నుంచి ఉదయం 3 గంటల నుంచి సాయంత్రం 4:30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

మాదాపూర్ : ఫీడర్ మరమ్మతుల కారణంగా అల్లాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తాత్కాలికంగా విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. ఇందులో భాగంగా 11 కేవీ ఎస్‌బీఐ ఫీడర్ పరిధిలోని కుత్బుల్లాపూర్ ఫ్లైఓవర్ సమీపంలో, బ్యాంక్‌కాలనీ, ఆర్‌ఆర్‌బార్, రెస్టారెంట్ తాండా పార్ట్ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం కలగనున్నట్లు ఆయన తెలిపారు.

## కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 23 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో బుధవారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 43, వంకాయ 40, బెండకాయ 55, పచ్చి మిర్చి 50, బజ్జి మిర్చి 75, కాకరకాయ 38, బీరకాయ 55, క్యాబేజి 26, ఫ్రెంచ్ బీన్స్ 125, క్యారెట్ 45, కాలీఫ్లవర్ 18, దొండ 40, కరివేపాకు 70గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

---

## ఫ్లైఓవర్ పనుల వేగం పెంచాలి..

పరిశీలించిన హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్


గచ్చిబౌలి ఫ్లైఓవర్ నిర్మాణం ప్లాన్ కాపీని పరిశీలిస్తున్న బల్దియా కమిషనర్ ఇలంబర్తి. చిత్రంలో జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, ప్రాజెక్టు అధికారి తదితరులు

మియాపూర్, అక్టోబర్ 23: బల్దియా నూతన కమిషనర్ ఇలంబర్తి బుధవారం శేరిలింగంపల్లి జోన్‌లో తొలిసారిగా పర్యటించారు. ఈ సందర్భంగా గచ్చిబౌలిలో నూతనంగా నిర్మిస్తున్న శిల్పాలే అవుట్ ఫ్లై ఓవర్ ఫేజ్-2 పనులను హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ప్రాజెక్టు సీఈ సదానందం, జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిలతో కలిసి నూతన కమిషనర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఓఆర్‌ఆర్ నుంచి కొండాపూర్ వరకు పనులను, తొలగించాల్సిన విద్యుత్ స్తంభాలు, విస్తరించాల్సిన రహదారులను పరిశీలించారు. అనంతరం కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ.. ఫ్లైఓవర్ నిర్మాణ పనులు మరింత వేగవంతం చేయాలని సూచించారు. నిత్యం ట్రాఫిక్‌తో ఉండే కీలక రహదారిపై ఈ పనులు జరుగుతున్నందున జాప్యం చేయవద్దని, గుత్తేదారు త్వరితగతిన పూర్తి చేసేలా కృషి చేయాలని ఆదేశించారు. రహదారి విస్తరణకు ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాలు కేబుళ్ల మార్పులో సంబంధిత శాఖ నుంచి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. ర్యాంపు నిర్మాణం నిమిత్తం తాత్కాలిక రహదారి నిర్మాణానికి విద్యుత్ కేబుళ్ల మార్పుతో ముడిపడి ఉన్నందున అధికారులు పనులను వేగవంతం చేయాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీసీ ముకుందరెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

### బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్‌కు సత్కారం


బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గెరెథ్ వైన్ ఓవెన్‌ను శాలువాతో సత్కరిస్తున్న విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధులు

దుండిగల్,అక్టోబర్ 23 : బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గెరెథ్ వైన్ ఓవెన్‌ను విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ వ్యవస్థాపక సీఈఓ డా.సత్యవోలు రాంబాబు, సలహాదారులు డా. ఎమ్‌ఆర్‌ఎస్.రాజు, డి.ఎల్లాసుబ్బారెడ్డి సత్కరించారు. బుధవారం సికింద్రాబాద్‌లో పర్యటించిన గెరెథ్ వైన్ ఓవెన్‌తో కలిసి సికింద్రాబాద్, ఉపకార్ ప్రాంగణంలోని స్వీకార్ పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్వీకార్ రిహాబిలిటేషన్ సైన్సెస్ అకాడమీలో జరుగుతున్న సేవలు, నడుస్తున్న కోర్సుల గురించి సంస్థ వ్యవస్థాపక చైర్మన్, పద్మశ్రీ అవార్డు గ్రహీత డా.పీ.హనుమంతరావు వివరించారు. హైకమిషనర్‌తోపాటు సందర్శకులందరూ అక్కడ చికిత్స తీసుకుంటున్న, చదువుకుంటున్న చిన్నారులందరినీ కలిసి ఆప్యాయంగా పలకరించారు. అక్కడి మానసిక దివ్యాంగులు కొందరు చేతులతో తయారు చేసిన రాఖీని బ్రిటిష్ హై కమిషనర్‌కు కట్టి, వారే సొంతంగా తయారు చేసిన మరో బొకేను కానుకగా ఇచ్చారు. విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ గురించి తెలుసుకున్న హై కమిషనర్ ఒకసారి సంస్థను సందర్శిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వృక్షజీవి, పిల్లల వైద్య నిపుణులు డా.వడ్రాణం మార్కండేయ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటా ..



ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లవేళలా ముందుంటానని మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు, కాలనీ/బస్తీ సంక్షేమ సంఘాల సభ్యులు బుధవారం శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

*– దుండిగల్, అక్టోబర్ 23*

### స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా అండర్-14 బాయ్స్ టీమ్‌కు త్రివేణి విద్యార్థి ఎంపిక



మదీనాగూడ త్రివేణి స్కూల్ విద్యార్థి సుజితి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా అండర్-14 బాయ్స్ టీమ్‌కు ఎంపికయ్యారు. బుధవారం త్రివేణి స్కూల్స్ సంస్థల డైరెక్టర్, డాక్టర్ జి. వీరేంద్ర చౌదరి, సీఆర్ఓ సాయి నర్సింహులు మదీనాగూడలోని త్రివేణి పాఠశాలలో విద్యార్థికి అభినందనలు తెలిపి ప్రశంసించారు. సుజితి కఠోర శ్రమ, అంకిత భావం పాఠశాలకు మరింత గౌరవాన్ని తెచ్చిపెట్టినట్లు పాఠశాల డైరెక్టర్ వీరేంద్ర చౌదరి తెలిపారు. ఈ విజయంలో ఉపాధ్యాయులు, కోచ్‌లు కీలకపాత్ర వహించారన్నారు. అనంతరం పాఠశాల సిబ్బంది సుజితిని అభినందించారు.

*– మాదాపూర్, అక్టోబర్ 23*

### ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ సుజాతకు శుభాకాంక్షలు



తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కాల్వ సుజాతకు గ్రేటర్ కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి కొపిశెట్టి దినేశ్‌కుమార్, కేపీహెచ్‌బీ కాలనీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ గంధం రాజు, జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా ప్రధాన కార్యదర్శి పెండ్రు రమారెడ్డిలు శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాల్వ సుజాత మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను పేద ప్రజలకు అందించాలని, ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ పార్టీ నేతలు పని చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసిన వారికి గుర్తింపు లభిస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని, ప్రజా పాలనతో ప్రజలందరూ సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు రాజేశ్ యాదవ్, సుబ్బునాయుడు, దార్ల వనజ, వీణ, సుజాత, వాణి, రోజా, దుర్గా, సరోజ తదితరులు ఉన్నారు.

*– కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 23*

**IN THE COURT OF THE HON'BLE III ADL. JUNIOR JUDGE AT :: ATTEVELI, MEDCHAL-MALKAJGIRI DISTRICT, T.S.**
**I.A.No. of 2024**
**in**
**O.S.No. 240 of 2022**

**Between:**
Sri Kunku Ravindernath (LR's) …Petitioners/Proposed Plaintiffs
Sri Kunku Tirupathi Rao ...Plaintiff (Died)
AND
Sri Jenaboina Lakshminarayana ...Respondent/Defendant

To
Jenaboina Lakshminarayana, S/o. J.Malakondaiah, Age: 60, Occ: Agriculture, R/o. H.No. 1521, Musali Palem Road, CCKR Nagar, Kaligiri Village and Mandal, Nellore, Dist., Andhra Pradesh.

Please take notice that the petitioners/plaintiffs have filed I.A.No. of 2024 for impleading both of you as defendant in OS No. 240 of 2022 and the same is posted to 26-11-2024 for yours appearance. Hence, you are hereby directed to appear in the above case on 26-11-2024 at 10.30 A.M. either in person or through an Advocate, failing which you both will be set ex-parte and orders will be passed.

(By order of the Hon'ble Court )
**M/s. REMIDALA KOTAIAH,**
Advocate
H No.4-32-300/1, L B Nagar, Shapurnagar, Jedimetla, Hyderabad-55,
**Cell: 7799112344.**